క్లుప్తంగా

నేడు రక్తదాన శిబిరం

కె.కోటపాడు: కె.కోటపాడు సీహెచ్‌సీలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.శ్రీలక్ష్మి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. రక్త దాతలు స్పందించాలని శ్రీలక్ష్మి కోరారు.

నేడు షిర్డీసాయి మందిర వార్షికోత్సవం

కొంకోట: మండలంలోని పల్లపు సోమవరం గ్రామంలో గల షిరిడి సాయి నాథ మందిర 12వ వార్షికోత్సవం సోమవారం పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, చైర్మన్ గొంతిన శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి క్షీర, జల అభిషేకాలు, ప్రత్యేక పూజలు స్వామి వారికి నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం, రాత్రి భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామని తెలిపారు. ఉభయ విశాఖ జిల్లాలోని విశాఖ, గాజువాక, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన ఆరు బృందాలతో కుచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు మధ్యాహ్నం జరుగుతాయని చెప్పారు. సాయంత్రం తిరువీధి ఉత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

చక్కెర వ్యాధిపై పాఠశాల విద్యార్థులకు అవగాహన



మధుమేహం వ్యాధిపై వివరిస్తున్న ఉపాధ్యాయుడు రాము

మాకవరపాలెం: మధుమేహం వ్యాధిపై అవగాహనకు పాఠశాలల్లో సుగర్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. చిన్నప్పటి నుంచి మధుమేహం వ్యాధిపై తెలియజేసేందుకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ సుగర్ షుగర్ బోర్డులు ఏర్పాటు చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. ఈ నేపథ్యంలో తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో షుగర్ బోర్డు ఏర్పాటు చేసినట్టు పాఠశాల ఉపాధ్యాయుడు కె.రాము తెలిపారు. షుగర్ వ్యాధి కారణంగా కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరిస్తున్నామన్నారు. తీపి పదార్థాలు అధికంగా తినడం వల్ల ఊబకాయం వచ్చి, పిల్లలు పడే ఇబ్బందులను తెలియజేస్తున్నట్టు చెప్పారు.

శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు



కృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న త్రైత సిద్ధాంత భక్తులు

మాకవరపాలెం: శ్రీకృష్ణుని ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. మండలంలోని అడిగర్లపాలెంలో ఏటా త్రైత సిద్ధాంత భక్తులు కృష్ణాష్టమి రోజున కృష్ణుడి ప్రతిమతో మండపం ఏర్పాటు చేసి తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం అడిగర్లపాలెం, పోతలూరు, మామిడిపాలెంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఘనంగా ఊరేగింపు చేశారు. ఈ ఊరేగింపులో పిల్లలు, పెద్దలు వివిధ వేషధారణలతో పాల్గొన్నారు. మహిళలు నిర్వహించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అడిగర్ల చినదేముడు, కచ్చల సూరిబాబు అధిక సంఖ్యలో త్రైత సిద్ధాంత భక్తులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయాలి

నర్సీపట్నం: ఈనెల 26న చేపట్టిన మాకవరపాలెం మండలం, భీమబోయినపాలెంలో అసంపూర్తిగా నిలిచిన మెడికల్ కళాశాల సందర్శనను విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ ఎన్.కె.శాస్త్రి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం కళాశాల నిర్మాణాన్ని నిలిపివేయడం సరికాదన్నారు. కాలేజీ నిర్మాణం పూర్తి అయితే ఈ ప్రాంత ప్రజలకు అత్యున్నత వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో పాటు వైద్య విద్య వల్ల ఎంతో మంది పేద పిల్లలకు న్యాయం చేకూరుతుందన్నారు. కళాశాల నిర్మాణాన్ని చేపట్టాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఈ సందర్శన చేపట్టామన్నారు. అన్ని వర్గాల వారు ఉమ్మడిగా స్పందిస్తే ఫలితం ఉంటుందన్నారు. ఈ సందర్శనకు హాజరై మీ విలువైన అభిప్రాయాలను తెలియజేయాలన్నారు.

హెల్మెట్ లేకుంటే కేసులు తప్పవు



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ రామకృష్ణారావు

రోలుగుంట: ద్విచక్రవాహనాలు నడిపే సమయంలో హెల్మెట్‌లు ధరించకుంటే కేసులు నమోదు తప్పవని వాహనదారులకు ఎస్ఐ పి.రామకృష్ణారావు వాహనదారులను హెచ్చరించారు. నర్సీపట్నం వడ్డాది ఆర్అండ్‌బీ రూట్‌లో ఆదివారం ఆయన వచ్చిపోయే వాహనాలను ఆయన సిబ్బందితో కలిసి రోలుగుంటలో విస్తృతంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో హెల్మెట్లు లేనివారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ వాహనచోదకులకు హెల్మెట్ మేలు గురించి వివరించారు.

వెద పద్ధతిలో ఖరీఫ్ వరి సాగు



కె.జె.పురంలో ఖరీఫ్ వరి వెద సాగుకు సిద్ధం చేసిన మడి



గాదిరాయిలో వరినాట్లకు సిద్ధం చేసిన పంట భూమి



వీరనారాయణంలో ఎదిగిన వెద వరి పంట



ఎం. కోటపాడులో వేసిన వరినాట్లు

- ఈ సీజన్‌లో వరినాట్లు పద్ధతికి స్వస్తి
- వర్షాభావం, ఖర్చులు పెరగడమే కారణం
- మండలంలో 60% వెద సాగులో వరి

మాడుగుల రూరల్: వర్షాభావం, ఇతర కారణాలతో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరినాట్లకు అదును దాటిపోవడంతో మండలంలో ఈ సీజన్‌లో ఎక్కువ మంది రైతులు వెదసాగు ద్వారా వరి పంట వేశారు. ఒక ఎకరా పంట భూమిలో వరినాట్లు వేయడానికి రూ. 35 వేలు నుంచి రూ 40 వేలు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. కేవలం వరిపంట వేయడానికి, మెట్టు దుక్కు దున్నిన తరువాత నుంచి పంట వేసి, కోసి, నూర్పు చేసే వరకు పైన పేర్కొన్న వ్యయం కావడంతో రైతులు ఈ పద్ధతికి స్వస్తి చెప్పి, వెద పద్ధతిలో వరి సాగుకు సిద్ధం అయ్యారు. మండలంలో సుమారు 11వేల ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఈ లక్ష్యం అధిగమించవచ్చునని వ్యవసాయ శాఖాధికారి అనసూయ పేర్కొన్నారు. ఈ వెదసాగుకు ముందుగా పంట భూమిని రెండు మూడు సార్లు మెత్తగా దున్నికుని, తర్వాత నీరు పెట్టి పూర్తిగా నీరు ఇంకిన తర్వాత వరి ధాన్యం చల్లుతారు. ఈ విధంగా వెద చల్లడం వల్ల వరి పంట వరినాట్లు వలే వెద పంట కూడా వస్తుంది. కలుపు నివారణకు గడ్డి మందు వాడుతున్నారు. తర్వాత సస్యరక్షణ చర్యలకు మందులు పిచికారీ వల్ల పంట ఏపుగా పెరుగుతుంది. దీని వల్ల కూలీల అవసరం కూడా లేదు. కలుపు తీయడానికి కూలీలు అవసరం లేదు. దీని వల్ల రైతులకు తక్కువ వ్యయం అవుతుందని అందువల్ల వెద సాగు మీద ఆసక్తి చూపిస్తున్నారు. నియోజకవర్గం మొత్తం మీద సుమారు 50వేల ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు చేస్తుండగా, సుమారు 25వేల ఎకరాల్లో ఎదసాగు చేస్తున్నారు.

వెదసాగుతో ఖర్చు ఆదా



ఖరీఫ్ సీజన్‌లో వెద సాగు వల్ల రైతుకు ఎంతో ఉపయోగకరంగా వుంది.తక్కువ పెట్టుబడితో ఈ సాగు ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చు. సస్యరక్షణ చర్యలకు తక్కువ పెట్టుబడితో పంట పండించవచ్చు. ఈ పద్ధతిలో సాగు చెయ్యడం వల్ల తెగుళ్ల కూడా సోకవు. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది.

–బోడ్డేడ వెంకట్రావు, రైతు, కె.జె.పురం

ఉపాధి పథకం అనుసంధానం చేయాలి



వెద పద్ధతి గురించి వ్యవసాయ శాఖ విస్తృతంగా ప్రచారం చేపట్టాలి. ప్రసుత్తం ఉపాధి హామీ పథకం వ్యవసాయానికి అనుసంధానం చేయాలి వరి సాగుకు పెట్టుబడులు, ఎక్కువగా అవుతున్నాయి. ఈ సమయంలో ఎద సాగు చేయడం వల్ల తక్కువ వ్యయంతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చు.

–కోన శ్రీను, రైతు వి.వి.అగ్రహారం

కె.జె.పురం మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీసులు

- గ్రామంలో ట్రాఫిక్ సమస్య
- శిథిలావస్థకు చేరిన తాచేరు వంతెన



శిథిలావస్థకు చేరిన కె.జె.పురంలో తాచేరు నదిమీద వంతెన

మాడుగుల రూరల్: అల్పపీడన ప్రభావంతో ఈ నెల 16, 17, తేదిలల్లో కురిసిన భారీ వర్షాలకు విజయరామరాజుపేట వద్ద బొడ్డేరు నది వద్ద తాత్కాలికంగా నిర్మించిన వంతెన నీటి ప్రవాహానిక కొట్టుకుని పోయింది. దీంతో విశాఖ నుంచి పాడేరు, మాడుగుల నుంచి అనకాపల్లి పోవు బస్సులు కె.జె.పురం గ్రామం మీదుగా నడుపుతున్నారు. దీంతో కె.జె.పురం గ్రామంలో ట్రాఫిక్ ఏర్పడుతుంది. ఉదయం సమయంలో పాడేరు నుంచి విశాఖ వచ్చే బస్సులు, విశాఖ నుంచి పాడేరు వెళ్లే బస్సులు ఒకేసారి రావడంతో గ్రామంలో ఇరుకు రోడ్డులో ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ప్రైవేటు వాహనాలు కూడా ఈ రహదారిలో తిరుగుతున్నాయి. కె.జె.పురం గ్రామంలో తాచేరు నది మీద నిర్మించిన వంతెన కూడా శిథిలావస్థకు చేరింది. శిథిల వంతెనకు సమీపంలో చెరకు కాటా వద్ద కల్వర్టు కూడా శిథిలావస్థకు చేరింది. ఈ కల్వర్టు ఎప్పుడు పడిపోతుందో చెప్పలేని స్థితిలో ఉంది. కాగా పెద్ద పెద్ద భారీ వాహనాలు రాత్రి పది గంటల తర్వాత ఈ వంతెన మీద నుంచి వెళ్లడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో శాలిపేట నుంచి సచివాలయం వరకు గల ఇరుకు రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఎదురువుతుంది. ఉదయం సమయంలో ఈ ట్రాఫిక్ సమస్య వల్ల ప్రజలు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఘనంగా బోడకొండమ్మ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మాకవరపాలెం: మండలంలోని జీకోడూరులో బోడకొండమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. పండగ సందర్భంగా ఆదివారం ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని గ్రామంలోని అన్ని వీధుల్లోనూ డప్పుల వాయిద్యాలు, కోలాటాల నడుమ వైభవంగా ఊరేగించారు. మధ్యాహ్నం జరిగిన భారీ అన్నసమారాధనలో భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఊరేగింపులో చిన్నారుల కోలాటం అందరినీ ఆకట్టుకుంది. పండగలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల: మోదమాంబ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామస్తులతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఓడ్డు పండగలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

పలు గ్రామాల్లో జోరుగా వరినాట్లు



వి.సంతపాలెం పొలాల్లో పొలాలను దమ్ములు పట్టి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్న రైతులు

కె.కోటపాడు: ఇటీవల అల్పపీడన ద్రోణి కారణంగా కురిసిన వర్షాలు మెట్ట ప్రాంత గ్రామాల్లో వరినాట్లు వేసే రైతులకు మేలు చేసాయి. వరుసగా మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడడం కారణంగా సాగునీటి చెరువుల్లోనికి నీరు చేరుకుంది. పొలాల్లో దమ్ములకు అవసరమైన వర్షపునీరు చేరుకోవడంతో ట్రాక్టర్లు, టిల్లర్లతో దమ్ములను చేపడుతున్నారు రైతులు. ప్రధానంగా మెట్ట ప్రాంత గ్రామాలైన వి.సంతపాలెం, ఉగ్గినవలస, డి.అగ్రహారం, ఆర్.వై.అగ్రహారం గ్రామాల్లో ప్రస్తుతం వరినాట్లు పూర్తి చేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. వాతావరణ పరిస్థితులు సహకరించి ఈ ఏడాది ఖరీఫ్‌లో మంచి దిగుబడితో కూడిన వరిపంట దక్కాలని సాగు రైతులు పేర్కొంటున్నారు.

చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి



గొలుగొండ ఎస్ఐ రామారావు



కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వర్రావు

గొలుగొండ: గ్రామాల్లో నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలకు పోలీసుల అనుమతులు తప్పకుండా ఉండాలని వినాయక మండపాలు ఏర్పాటు చేసే కమిటీ పోలీసులు అనుమతులు తీసుకోవాలని గొలుగొండ, కృష్ణదేవిపేట ఎస్ఐలు రామారావు, తారకేశ్వర్రావు తెలిపారు. ఎస్ఐలు విలేకరులతో మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు తప్ప ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. కమిటీ సభ్యులు వినాయక మండపాలు ఎన్ని రోజులు ఏర్పాటు చేస్తారో తెలపాలని కోరారు. నిమజ్జనం కార్యక్రమంలో పోలీసు అధికారుల సూచనల మేరకు సురక్షిత ప్రాంతంలోనే వినాయక నిమజ్జనాలు జరపాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీలు



బుచ్చెయ్యపేట మండల నాయకులతో మాట్లాడుతున్న అమర్‌నాథ్

బుచ్చెయ్యపేట: మండలంలో 35 పంచాయతీ గ్రామాల్లో సెప్టెంబర్ నెలాఖరులోగా అన్ని గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలు, మండల కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. ఆదివారం బుచ్చెయ్యపేట మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ మొదటి వారం నుండి చోడవరం, రావికమతం, రోలుగుంట, బుచ్చెయ్యపేట మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తామన్నారు. రోజుకో మండలంలో నాలుగు గ్రామాల్లో మండల నాయకులతో కలిసి పర్యటించి ప్రతి గ్రామంలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే నాలుగు మండలాల్లో మండల కమిటీలతో పాటు ముఖ్య నాయకులకు నియోజకవర్గ కమిటీ,జిల్లా కమిటీల్లో అవకాశం కల్పిస్తామన్నారు. ప్రతి కార్యకర్త మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఆయన సిద్ధాంతాలకు లోబడి పని చేయాలన్నారు. గ్రూపు రాజకీయాలు కడితే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్ధనరావు, నాయకులు జోగా కొండబాబు, నమ్మి అప్పలరాజు, ముచ్చకర్ల అప్పారావు, సుంకరి గాంధీ, శ్రీను, కోరుకొండ అప్పలనాయుడు, సీరా అర్జున, పల్లా పోలి నాయుడు పాల్గొన్నారు.

తూర్పుకాపుల సంక్షేమానికి కృషి



సమావేశంలో తూర్పుకాపుల సంక్షేమంపై చర్చిస్తున్న నాయకులు

యలమంచిలి రూరల్: జిల్లాలో తూర్పు కాపుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కృషి చేస్తున్నట్టు జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు, న్యాయవాది కరణం శ్రీహరి తెలిపారు. ఆదివారం యలమంచిలిలో ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లాలో తూర్పుకాపులు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం 7 నియోజకవర్గాలకు తూర్పుకాపు పరిశీలకులను నియమించారు. అడపా శేషగిరిరావు (పాయకరావుపేట), వెలంశెట్టి శ్రీనివాసరావు(పెందుర్తి), అందే రమణ(యలమంచిలి), నక్కా శివశంకరావు(అనకాపల్లి), సిరిగిశెట్టు నానాజీ(నర్సీపట్నం), అన్నం రమణ(మాడుగుల), పోలిన సూర్య జగ్గారావు(చోడవరం) పరిశీలకులుగా నియమితులయ్యారు. కార్యక్రమంలో జెర్రిపోతుల వెంకట్రావు, పాలిపిని రాము, పతివాడ గణేష్, రావి రామసత్యం పాల్గొన్నారు.

డీఎస్సీ విజేతలకు నేతల అభినందనలు

చీడికాడ: డీఎస్సీ ఫలితాల్లో ర్యాంకులు సాధించిన బైలపూడి, వరహాపురం అభ్యర్థులను మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, ఎంపీపీ కురచా జయమ్మ అభినందించారు. వారు ఆదివారం మాట్లాడుతూ వరహాపురానికి చెందిన దొడ్డి సత్యనారాయణ, ఇందల నాగఉమ, యలమంచిలి యర్రయ్యలు ర్యాంకులు సాధించగా బైలపూడికి చెందిన గెంజి రవి, గాడి అనిల్, ఆర్.త్రినాథ్ ఉమ్మడి విశాఖ జిల్లాలోనే మెరుగైన ర్యాంకులు సాధించారని వారు తెలిపారు. వీరందరినీ ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ముందుకుసాగాలని ఆకాంక్షించారు. అభినందించిన వారిలో వైస్ ఎంపీపీలు ధర్మిశెట్టి స్వాతికొండబాబు, కిముడు చిన్నమ్మలు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కొత్తకోట హైస్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

రావికమతం: కొత్తకోట హైస్కూల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొత్తకోట హైస్కూల్లో 1984–1985 విద్యా సంవత్సరంలో 100 మంది విద్యార్థులు పదో తరగతి వరకు చదివారు. వీరంతా ఏళ్ల తరువాత అంతా కలుసుకున్నారు. వీరిలో కొందరు ప్రభుత్వ ఉద్యోగులుగా, వ్యాపారులుగా, గృహిణులుగా వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. ఆదివారం ఉదయాన్నే కొత్తకోటలో కలుసుకుని విద్యాభ్యాసం నాటి రోజులను నెమరువేసుకున్నారు. పలువురు కుటుంబాలతో వచ్చారు. ఒకరినొకరు పరిచయాలు చేసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. మధ్యాహ్న అంతా కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు సూర్యనారాయణ, ఆర్.వి.స్వామి దంపతులకు ఆత్మీయక సమ్మేళనానికి ఆహ్వానించి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కోట వెంకటరమణ, పరవాడ నారాయణదొర, కోట సత్యనారాయణ, వీరణాల గోవింద, వాసంశెట్టి శ్రీనివాసరావు, అలమండ శ్రీను, మలసాల కిషోర్ చొరవతో ఆత్మీయ కలయక కార్యక్రమం జరిగింది. ప్రతి ఏటా కలుసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

దేవరాపల్లి: మండలంలో ఎరువులు దుకాణాలను మండల వ్యవసాయాధికారి ఎల్.వై.కాంతమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దేవరాపల్లి, కాశీపురం గ్రామాల్లో ఎరువుల దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువుల షాపుల యజమానులకు పలు సూచనలు చేశారు. ఎరువులను స్థానిక మండలంలో గల రైతులకు మాత్రమే విక్రయించాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని, బిల్లు ఇవ్వాలని, షాపు వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేయాలని దుకాణదారులకు సూచించారు. మండల వ్యవసాయ విస్తరణాధికారి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

సుందరరావుకు మదర్ థెరిసా పురస్కారం



సుందరరావును సత్కరిస్తున్న సొసైటీ ప్రతినిధులు

పాయకరావుపేట: స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ మెంబర్ దోమాడ సుందరరావుకు మదర్ థెరిసా పురస్కారం లభించింది. తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో మదర్ థెరిసా ఎడ్యుకేషనల్ సొసైటీ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. సొసైటీ వ్యవస్థాపకుడు డాక్టర్ దిడ్ల కిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి, ఉమ్మడి విశాఖ జిల్లాల్లో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని ఎంపిక చేసి ఈ పురస్కారాన్ని అందజేశారు. రాజకీయ, ఆధ్యాత్మిక రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్నందుకుగాను తనను ఎంపిక చేసి పురస్కారాన్ని అందజేసినట్లు ఈ సందర్భంగా సుందరరావు తెలిపారు. సొసైటీ ప్రతినిధులు సుందరరావు దంపతులను దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈయన గత ఏడాది మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, మేడపాటి శ్రీనివాసరెడ్డి, గుడివాడ సీఐ రమణమ్మ, యోగా గురువు సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేబీ రోడ్డులో ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు







పెదమదీన జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు, కేబి రోడ్డులో ఏర్పాటు చేసిన గ్రామాలకు వెళ్లే బోర్డులు, బుచ్చెయ్యపేట, కందిపూడి గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన సెంటర్ లైనింగ్

బుచ్చెయ్యపేట: మండలంలో గల కొంకోట,బంగారుమెట్ట(కేబీ) రోడ్డులో ప్రమాద హెచ్చరిక బోర్డులను ఆర్అండ్‌బీ అధికారులు ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ రోడ్డులో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు చేపట్టారు. బంగారుమెట్ట నుంచి అనకాపల్లి వరకు బీఎస్ రోడ్డు పూర్తిగా శిథిలమై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. మూడేళ్ల కిందట వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి జిల్లా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీల కృషితో కేబీ రోడ్డు నిర్మాణానికి రూ.32 కోట్లు మంజూరు చేశారు. సింగిల్ రోడ్డుగా ఉన్న కేబీ రోడ్డును విస్తరించి డబుల్ రోడ్డుగా ఏర్పాటు చేశారు. బంగారుమెట్ట, చిన అప్పనపాలెం, దిబ్బిడి, బుచ్చెయ్యపేట, కందిపూడి, రాజాం,కూండ్రం, వేట జంగాలపాలెం మీదుగా అనకాపల్లి రైల్వే బ్రిడ్జి వరకు రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు ఏర్పాటుతో బుచ్చెయ్యపేట, రావికమతం, మాడుగుల తదితర మండలాల ప్రజలకు అనకాపల్లి, గాజువాక, విశాఖ తదితర ప్రాంతాలకు వెళ్లడానికి ప్రయాణానికి అనువుగా ఉంది. వడ్డాది నుండి చోడవరం, వెంకన్నపాలెం, తుమ్మపాల వెళ్లే రహదారి శిథిలావస్థకు చేరి పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. చోడవరం రహదారి రాకపోకలకు అనువుగా లేకపోవడంతో చాలా మంది ప్రయాణికులు కేబీ రోడ్డు నుంచి ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారు. వాహనాల రద్దీతో కేబీ రోడ్డు ట్రాఫిక్ పెరగడంతో పాటు విశాలంగా ఉండడంతో వేగంగా వస్తున్న వాహనదారుల వల్ల పలు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు ప్రమాదాల నివారణకై ప్రతి గ్రామం వద్ద, జంక్షన్‌లు, స్కూల్, దేవాలయాలు వద్ద స్పీడ్ బ్రేకర్లు మళ్లింపులు వద్ద గుర్తులు, రేడియం స్టిక్కర్లతో పాటు రోడ్డు సెంటర్ మార్జిన్‌లు ఏర్పాటు చేశారు. అలాగే ప్రతి గ్రామం వద్ద ఊర్ల పేర్లతో బోర్డులు, ఏ రహదారి ఏ గ్రామానికి వెళ్తుందో ఊరు పేర్లతో బోర్డులు ఏర్పాటు చేశారు. బీఎస్ రోడ్డులో ఆర్అండ్‌బీ అధికారులు తీసుకున్న రక్షణ ఏర్పాట్ల వల్ల ఈ రహదారిలో రాకపోకలు సాగించే ప్రయాణికులకు సరికొత్త అనుభూతి కలగడంతో పాటు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త పడుతున్నారు.

చేపల మార్కెట్‌కు సదుపాయాలు కల్పించాలి

ఎస్.రాయవరం: చెట్టు కింద చేపల మార్కెట్‌కు సదుపాయాలు కల్పించాలని జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు డిమాండ్ చేశారు. తిమ్మాపురం పంచాయతీలో చెట్టు కింద చేపల మార్కెట్ నిర్వహిస్తున్న మత్స్యకార మహిళలతో కలిసి ఆయన మాట్లాడారు. తిమ్మాపురం, పెదగుమ్ములూరు పంచా యతీ పరిధిలో రేవుపోలవరం, బంగారమ్మపాలెం గ్రామాల మత్స్యకారులు ఇక్కడ చెట్టు కింద చేపలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నారన్నారు. వారి నుంచి ఆశీలు వసూళ్లు చేస్తున్నప్పటికీ నీడ, మరుగుదొడ్లు, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించలేదని విమర్శించారు.